మనం తినే తిండి.. వేసుకునే దుస్తులు, మందులు.. ఉపయోగించే మొబైల్, కంప్యూటర్.. నడిపే వాహనం.. ఇలా అన్ని రకాల వస్తువులు ఎక్కడో తయారై మన ఊరిలోకి.. అందులోనూ మన వీధిలోకి.. ఇంకా చెప్పాలంటే ఇంటింటికీ ఎలా వచ్చి చేరుతున్నాయో ఎప్పుడైనా ఆలోచించారా? ఉత్పత్తి కేంద్రం నుంచి వినియోగదారుడి వరకు వీటిని పాడైపోకుండా సకాలంలో చేర్చడంలో ఎంతోమంది నిపుణులు పని చేస్తుంటారు. నిత్యజీవితంతో ఇంతగా ముడిపడిపోయిన ఈ రంగమే 'లాజిస్టిక్స్'. వచ్చే నాలుగేళ్లలో ఇందులో దాదాపు 30 లక్షల ఉద్యోగాలు రాబోతున్నాయని ఒక సర్వేలో తేలింది. మన తెలుగు రాష్ట్రాల్లోనే లక్షల ఉద్యోగాలు లభించబోతున్నాయి. విస్తృతమైన ఈ రంగంలోకి ప్రవేశించి అవకాశాలను అందుకోవాలంటే లాజిస్టిక్స్‌కి సంబంధించి కొన్ని కోర్సులు చేయాలి. టెన్త్, ఇంటర్, సాధారణ డిగ్రీ అర్హతలతో అవి అందుబాటులో ఉన్నాయి.

వస్తు రవాణా.. మస్తు కొలువులు

ఆవసరమైన సమయంలో ఏ వస్తువైనా అందుబాటులో లేకపోతే ఎంత ఇబ్బందో కదా! అందుకే సరైన వస్తువును, సరైన పరిమాణంలో, సరైన సమయంలో, సరైన ప్రాంతానికి తక్కువ ధరలో చేర్చే రవాణా నిర్వహణ యంత్రాంగమే 'లాజిస్టిక్స్'. ఈ పదం గ్రీకు పదం 'లోగోస్' నుంచి ఆవిర్భవించింది. అలెగ్జాండర్, డ్యూక్ వెల్లింగ్టన్, హన్నీబాల్ వంటి సైనిక నాయకుల ఆధ్వర్యంలో జరిగిన యుద్ధాల్లో యుద్ధ సామగ్రిని సరఫరా చేస్తున్న సమయంలో లాజిస్టిక్స్ అనే పదం వాడుకలోకి వచ్చింది. తర్వాత 1990 ప్రారంభంలో వ్యాపార రంగంలోకి ప్రవేశించింది. ఇప్పుడు మనకు తెలియకుండానే మన నిత్య జీవితంతో ఎంతో అనుబంధాన్ని పెంచుకుంది.

ముడిసరకు నుంచి తుది ఉత్పత్తిగా తయారైన వస్తువు, దాని నిల్వ, సరఫరా, క్రయవిక్రయాలతో కూడిన చక్రాన్ని సమర్థంగా నిర్వహించడమే లాజిస్టిషియన్ విధి. దేశ ఆర్థిక వ్యవస్థను శాసిస్తున్న లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ విప్లవాత్మక మార్పులతో తన ప్రాముఖ్యతను పెంచుకుంటోంది. ప్రస్తుత వ్యాపార రంగంలో తన పరిధిని విస్తృతం చేసింది. వచ్చే నాలుగేళ్లలో భారత్‌లో 30 లక్షల ఉద్యోగాలు లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ రంగం సృష్టిస్తుందని టీమ్‌లీజ్ అనే సంస్థ ఒక నివేదికలో వెల్లడించింది. అటు ప్రభుత్వ, ఇటు ప్రైవేటు రంగాల్లో పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న ఈ రంగంలో మంచి భవిష్యత్తు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. మరి ఇందులోకి ప్రవేశించాలంటే ఏం చేయాలి.. ఎలాంటి విద్యార్హతలు కలిగి ఉండాలి.. ఏ కోర్సులు చదవాలి.. ఏయే అవకాశాలు ఉంటాయి తదితర విషయాలు తెలుసుకుంటే అభ్యర్థుల ఆసక్తి మేరకు మంచి నిర్ణయం తీసుకోడానికి వీలవుతుంది.

కనీస అర్హతలు

సర్టిఫికెట్ కోర్సులు మొదలు, పీజీ, పీహెడ్‌డీల వరకు ఎన్నో రకాల కోర్సులు లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్‌కి సంబంధించి ఉన్నాయి. పదోతరగతి, ఇంటర్మీడియట్, సాధారణ డిగ్రీలు కనీస అర్హతగా ఈ కోర్సులను పలు సంస్థలు అందిస్తున్నాయి. దీంతోపాటు ఒత్తిడిలో పని చేయగల సామర్థ్యం, అంకితభావం, బృందస్ఫూర్తి, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, విశ్లేషణ సామర్థ్యం, భౌగోళిక పరిజ్ఞానం, సంస్థాగత నైపుణ్యాలు, స్వీయ నిర్ణయ శక్తి, సమయ పాలన, ఆర్థిక లావాదేవీల అంచనాలో పరిజ్ఞానం మొదలైన అదనపు లక్షణాలు ఉంటే మంచి రాణింపు ఉంటుంది.

పలు రకాల కోర్సులు

దేశవ్యాప్తంగా వివిధ యూనివర్సిటీలు, సంస్థలు లాజిస్టిక్స్‌లో పలు రకాల కోర్సులను అందిస్తున్నాయి.

- సర్టిఫికెట్ కోర్స్ ఇన్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్
- అడ్వాన్స్‌డ్ సర్టిఫికెట్ ఇన్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్
- ప్రొఫెషనల్ సర్టిఫికెట్ ఇన్ లాజిస్టిక్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్
- ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్ ◗ డిప్లొమా ఇన్ మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్ (కంటైనరైజేషన్) అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ రిటైల్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్
- డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్ ◗ డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ అండ్ ట్రాన్స్‌పోర్ట్ ◗ అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్ ◗ అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ◗ పీజీ డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్ ◗ పీజీ డిప్లొమా ఇన్ మెటీరియల్స్ అండ్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ◗ పీజీ డిప్లొమా ఇన్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ ◗ పీజీ డిప్లొమా ఇన్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ ◗ బీఎస్సీ లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్
- బీకాం లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్ ◗ బీబీఎం లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్ ◗ బీబీఏ లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్
- ఎంబీఏ లాజిస్టిక్స్ అండ్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్
- ఎంబీఏ లాజిస్టిక్స్ అండ్ ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్ట్
- ఎంబీఏ లాజిస్టిక్స్ అండ్ పోర్ట్ మేనేజ్‌మెంట్
- ఎంబీఏ లాజిస్టిక్స్ అండ్ షిప్పింగ్
- పీహెచ్‌డీ ఇన్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్

కోర్సులను అందిస్తున్న కొన్ని సంస్థలు

లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్‌లో కోర్సులు చేయాలనుకునే విద్యార్థులకు కొన్ని విద్యాసంస్థలు ప్రత్యేకంగా ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నాయి. మరికొన్ని విద్యాసంస్థలు క్యాట్, మ్యాట్, గ్జాట్‌లు లేదా వాటికి సమానమైన పరీక్షల్లో అర్హత సాధించిన వారిని చేర్చుకుంటున్నాయి. సాధారణంగా ప్రతి సంవత్సరం మార్చి, సెప్టెంబరులో ప్రవేశపరీక్షలు ఉంటాయి.

లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో తెలుగు రాష్ట్రాల్లోనూ కోర్సులను అందించే విద్యాసంస్థలు ఉన్నాయి. హైదరాబాద్‌లో సన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్, ట్రేడ్ వింగ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్, లండన్ మేనేజ్‌మెంట్ అకాడమీ లాంటి విద్యాసంస్థలు ఎంబీఏలో లాజిస్టిక్స్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లా రెండు సంవత్సరాల ఎంబీఏ లాజిస్టిక్స్, పీజీ డిప్లొమాలో లాజిస్టిక్స్ సప్లై మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తోంది. తమిళనాడులో కోయంబత్తూర్ మెరైన్ కాలేజ్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాజిస్టిక్స్, ఇందిరా గాంధీ కాలేజ్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, వేల్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్, మధురై కామరాజ్ యూనివర్సిటీ వంటి చోట్ల కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఇవేకాకుండా ఈ కింద పేర్కొన్న మరికొన్ని సంస్థలు దేశవ్యాప్తంగా లాజిస్టిక్స్‌కి సంబంధించి రకరకాల కోర్సులు అందిస్తున్నాయి.

ప్రభుత్వరంగంలో

- ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ, కొచ్చి, చెన్నై,ముంబయి, నవీ ముంబయి, విశాఖపట్నం. (www.imu.edu.in)
- ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంపోర్ట్ అండ్ ఎక్స్‌పోర్ట్ మేనేజ్‌మెంట్, అహ్మదాబాద్ (www.iiiem.in)
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైల్ ట్రాన్స్‌పోర్ట్, న్యూదిల్లీ (www.irt-india.com)
- కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఎకనామిక్స్ స్టడీస్, డెహ్రాడూన్ (www.upes.ac.in)
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రైల్ ట్రాన్స్‌పోర్ట్, వడోదర, గుజరాత్ (www.nrti.in)

ప్రైవేటు పరిధిలో

- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లాజిస్టిక్స్, విజయవాడ
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెట్రో అండ్ రైల్ టెక్నాలజీ, హైదరాబాద్ (www.imrtindia.edu.in)
- గీతం ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ బిజినెస్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ (www.gsib.gitam.edu)
- అకాడమీ ఆఫ్ మారిటైమ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్, ముంబయి, చెన్నై (డీమ్డ్ యూనివర్సిటీ). (www.ametuniv.ac.in)
- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటీరియల్ మేనేజ్‌మెంట్, ముంబయి (www.iimm.org)
- డాక్టర్ ఎంజీఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, చెన్నై (www.drmgrdu.ac.in)
- స్పీడ్‌వింగ్స్ అకాడమీ ఫర్ ఏవియేషన్ సర్వీసెస్, కేరళ (www.speedwings.org)

(మరిన్ని సంస్థల వివరాల కోసం www.eenaduprat-ibha.net చూడవచ్చు.)

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు అనుసంధానమై అభివృద్ధి పథంలో నడుస్తున్న నేపథ్యంలో ఈ రంగంలో కంపెనీలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఉద్యోగావకాశాలు కూడా ఎక్కువవుతున్నాయి. ఈ డిమాండ్ ఎప్పటికీ ఉంటుందని నిపుణులు అంటున్నారు. ఈ-కామర్స్ ఇండస్ట్రీ విస్తృతమవడం వల్ల నైపుణ్యం ఉన్నవారికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. డెలివరీ బాయ్స్ మొదలుకొని మేనేజ్‌మెంట్ వరకు అన్ని స్థాయుల్లో వృద్ధి సాధించవచ్చు. భౌగోళిక పరిజ్ఞానంతో పాటు నిర్వహణ, సమన్వయం, కంప్యూటర్ నైపుణ్యాలు ఉన్నవారికి ఇక్కడ మంచి భవిష్యత్తు తప్పక ఉంటుంది.

తెలుగు రాష్ట్రాల్లో

లాజిస్టిక్స్ రంగం ప్రాధాన్యాన్ని గుర్తించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విశాఖపట్నం-చెన్నై కారిడార్ అభివృద్ధిలో భాగంగా విశాఖపట్నం, శ్రీకాళహస్తిల దగ్గర లాజిస్టిక్ హబ్‌లను ఏర్పాటు చేయనుంది. కాకినాడలో 'ఆంధ్రప్రదేశ్ లాజిస్టిక్స్ యూనివర్సిటీ' ఏర్పాటు ప్రయత్నాలు జరుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎగుమతులను ప్రోత్సహించేందుకు పలుచోట్ల డ్రైపోర్టుల ఏర్పాటుకు ప్రతిపాదనలు మొదలయ్యాయి. ఇవి పూర్తిస్థాయిలో కార్యరూపం దాలిస్తే పలు ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఒక్క హైదరాబాద్ ప్రాంతంలోనే దాదాపు రెండు లక్షల ఉద్యోగాలు వస్తాయని టీమ్‌లీజ్ అనే సంస్థ అంచనా వేసింది.

ఉద్యోగాల పరిధి విస్తృతం

లాజిస్టిక్స్ రంగంలో ఉద్యోగాల పరిధి చాలా విస్తృతమైంది. చురుకైన ప్రతిభావంతులకు దేశ, విదేశాల్లో ఎన్నో రకాల అవకాశాలు ఉన్నాయి. కొరియర్ కంపెనీల ఏర్పాటుతో ఈ రంగం ప్రాధాన్యం మరింత పెరిగింది. కార్గో మేనేజ్‌మెంట్, షిప్పింగ్ కంపెనీలు లాజిస్టిక్స్‌లో ప్రొఫెషనల్ డిగ్రీ ఉన్నవారినే తీసుకుంటున్నాయి. సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్‌కి సంబంధించి ఎక్కువగా ఎంట్రీ లెవెల్ మేనేజర్ల ఉద్యోగాలు లభిస్తున్నాయి. లాజిస్టిక్స్‌లో ఎంబీఏ చేసినవారిని ట్రెయినీలు, అనలిస్టులు, ఫ్రంట్ లైన్ సూపర్‌వైజర్లుగా పెద్ద పెద్ద ఉత్పత్తి కంపెనీలు రిక్రూట్ చేసుకుంటున్నాయి. రోడ్డు, రైలు, జల, వాయు రవాణా మార్గాలు, కొరియర్ సంస్థలు, గిడ్డంగులు, ప్యాకేజీలు, ఆసుపత్రులు, వస్త్ర పరిశ్రమ, వాహనరంగం, ప్రచురణ, ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ రంగం, ఫాస్ట్ మూవింగ్ కన్జూమర్ గూడ్స్ కంపెనీలు, విద్యాసంస్థలు ఇలా అనేక రంగాల్లో ఈ నిపుణులకు ఉద్యోగాలు ఉన్నాయి. వాటిలో కొన్ని ప్రధానమైనవి..

- లాజిస్టిక్స్, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్
- సప్లై చెయిన్ అనలిస్ట్
- సప్లై చెయిన్ మేనేజర్
- సప్లై చెయిన్ కన్సల్టెంట్
- కస్టమర్ సర్వీస్ మేనేజర్
- ఫుల్‌ఫిల్‌మెంట్ సూపర్‌వైజర్
- కన్సల్టెంట్
- ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజర్
- వేర్‌హౌస్ ఆపరేషన్స్ మేనేజర్
- షిప్పింగ్ కోఆర్డినేటర్
- ఎక్స్‌పోర్ట్ ఎగ్జిక్యూటివ్
- ఎక్స్‌పిడైటర్
- పర్చేజ్ మేనేజర్
- సప్లై చెయిన్ సాఫ్ట్‌వేర్ మేనేజర్
- ఇంటర్‌నేషనల్ లాజిస్టిక్స్ మేనేజర్

ఉద్యోగాలిచ్చే కొన్ని సంస్థలు

❑ బ్లూడార్ట్ ❑ ఫెడెక్స్ ❑ హెల్త్‌కార్ట్ ❑ అగర్వాల్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ ❑ డీటీడీసీ ❑ ఫస్ట్ ఫ్లైట్ ❑ స్పైస్‌జెట్ ❑ టీసీఎస్ ❑ కాగ్నిజెంట్ ❑ అశోక లేలాండ్ ❑ ప్రభుత్వ రంగంలో ఓఎన్‌జీసీ, గెయిల్, ఎన్‌హెచ్‌పీసీ లాంటి పలు కంపెనీలు.

రైల్వే యూనివర్సిటీలో కొత్త కోర్సులు

రైల్వే, ఇతర రవాణా రంగాలకు కావలసిన సుశిక్షితులైన సిబ్బంది అవసరం పెరుగుతోంది. ఈ గిరాకీని దృష్టిలో ఉంచుకుని దేశ రవాణా రంగానికి కావలసిన నిపుణులను తయారుచేసే లక్ష్యంతో ఏర్పడిన డీమ్డ్ యూనివర్సిటీ.. 'నేషనల్ రైల్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌స్టిట్యూట్' (ఎన్ఆర్‌టీఐ). దేశంలోనే తొలి రైల్వే విశ్వవిద్యాలయంగా పేరుపొందిన ఈ సంస్థ సరికొత్త అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులను ప్రవేశపెట్టింది.

గుజరాత్ వడోదరలో ఉన్న ఎన్ఆర్‌టీఐ.. రెండు పూర్తిస్థాయి కోర్సులను ప్రారంభిస్తోంది. 2018-19 విద్యాసంవత్సరానికి ప్రవేశాలు జరిగే మూడు సంవత్సరాల వ్యవధి గల రెసిడెన్షియల్ కోర్సులివి.

1. బీబీఏ ఇన్ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజ్‌మెంట్: విభిన్న సబ్జెక్టుల కలయికగా ఉపరితల రవాణా అంశాలపై బోధన కేంద్రీకరిస్తుంది. దేశరవాణాపై యువతకు నూతన నైపుణ్యాలూ, ఆలోచనలు కలిగించేలా కోర్సును రూపొందించారు. ప్రపంచంలోని ఉపరితల రవాణాపై జరిగే పరిశోధనలు, నూతన ఆవిష్కరణలను తెలుపుతూ ప్రాజెక్టులో స్వీయ అనుభవం ద్వారా పాఠ్యాంశాల బోధన జరుగుతుంది.

2. బీఎన్‌సీ ఇన్ ట్రాన్స్‌పోర్టేషన్ టెక్నాలజీ: ఈ కోర్సులో బహుళ శాస్త్రాల పాఠ్యాంశాలు ప్రధానాంశంగా ఉంటాయి. రైల్వేల్లోని వివిధ సంస్థల పనితీరుపై అధ్యయనం ఉంటుంది. దేశ విదేశ రవాణా వ్యవస్థలోని ఆధునిక పోకడలు, పరిశోధనల గురించి అవగాహన పెంచుతారు. **అర్హత:** ఇంటర్మీడియట్‌లో గణితం ఒక సబ్జెక్టుగా చదివివుండాలి. కనీసం 55 శాతం మార్కులు సాధించివుండాలి. ఎస్‌సీ, ఎస్‌టీ, ఓబీసీ విద్యార్థులైతే 50 శాతం మార్కులుంటే చాలు. అభ్యర్థుల వయసు ఆగస్టు 1, 2018 నాటికి 25 సంవత్సరాలలోపు ఉండాలి.

ఎంపిక విధానం: 1. ఇంటర్మీడియట్‌లో పొందిన మార్కులు 2. ఎన్ఆర్‌టీఐ ప్రవేశపరీక్షలో పొందిన మార్కులు. దరఖాస్తుదారుల్లోంచి ఎంపికచేసిన అభ్యర్థులకు జులై నెలలో ఎన్ఆర్‌టీఐ ప్రవేశపరీక్షను నిర్వహిస్తారు. పరీక్ష తేదీని తర్వాత ప్రకటిస్తారు. ఈ పరీక్ష దేశంలోని ప్రధాన పట్టణాల్లో జరుగుతుంది.

హాస్టల్, మెస్ చార్జీలు, ట్యూషన్ ఫీజు కలిపి: రూ. 82,500. విద్యార్థులు విధిగా హాస్టల్లో ఉండాలి. విద్యార్థులందరికీ రైల్వేలోని వివిధ విభాగాల్లో ఆన్ ద జాబ్ ట్రెయినింగ్‌ను అందిస్తారు.

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 30, 2018. **తరగతుల ప్రారంభం:** ఆగస్టు 2018. **వెబ్‌సైట్:** https://nrti.in

ఉపాధికి భిన్న అవకాశాలు

ఇండియన్ మారిటైమ్ యూనివర్సిటీ (ఐఎంయూ)- చెన్నై మూడేళ్ల బీబీఏ (లాజిస్టిక్స్, రిటైలింగ్, ఇ-కామర్స్), రెండేళ్ల ఎంబీఏ- ఇంటర్నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ అండ్ లాజిస్టిక్ మేనేజ్‌మెంట్, ఎంబీఏ-పోర్ట్ అండ్ షిప్పింగ్ మేనేజ్‌మెంట్ కోర్సులను అందిస్తోంది. హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెట్రో అండ్ టెక్నాలజీ సంస్థ ఏడాది నిడివిగల పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాం ఇన్ రైల్ అండ్ మెట్రో ట్రాన్స్‌పోర్ట్ (పీజీపీఎంఆర్‌టీ) కోర్సును అందిస్తోంది.

రైల్వే విశ్వవిద్యాలయం వీటికి భిన్నంగా బీబీఏ ట్రాన్స్‌పోర్టేషన్ మేనేజ్‌మెంట్ కోర్సును ఈ ఏడాదే ప్రవేశపెట్టింది. బీఎస్‌సీ ట్రాన్స్‌పోర్టేషన్ టెక్నాలజీ కోర్సును దేశంలోని ఏ సంస్థా అందించడంలేదు. ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి రోడ్డు రవాణా, జల రవాణా, రైలు, విమానయాన రంగాల్లోని వివిధ సంస్థల్లో నిపుణులుగా చేరే అవకాశం లభిస్తుంది. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ లాంటి ఈ-కామర్స్ సంస్థల్లో నిపుణులుగా, మేనేజర్లుగా చేరవచ్చు.

- వి.జగదీశ్వర్, విద్యారంగ నిపుణుడు

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

వైజాగ్ డీసీసీబీలో క్లర్క్ పోస్టులు

విశాఖపట్నంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో స్టాఫ్ అసిస్టెంట్/ క్లర్క్ పోస్టులకు దరఖాస్తులు. **ఖాళీలు:** 61. **అర్హత:** ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత, కంప్యూటర్ పరిజ్ఞానం. **వయసు:** 18 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది:** 02.07.2018. **వెబ్‌సైట్:** http://vizagdccb.org.in/

ఆర్‌జీయూకేటీ- బాసరలో గెస్ట్ ఫ్యాకల్టీ

బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ, ల్యాబ్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు. **విభాగాలు:** ఇంజినీరింగ్, సైన్స్, మేనేజ్‌మెంట్, భాషలు. **అర్హత, ఎంపిక:** విశ్వవిద్యాలయం నిబంధనల ప్రకారం. **మరిన్ని వివరాలకు వెబ్‌సైట్:** http://www.rgukt.ac.in/

ఈసీఐఎల్‌లో టెక్నికల్ ఆఫీసర్లు

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు. **పోస్టు-ఖాళీలు:** టెక్నికల్ ఆఫీసర్ (ఈసీసీ/ ఈఈఈ/ ఎంఈ/ సీఎస్‌ఈ)- 15, సైంటిఫిక్ అసిస్టెంట్- 02. **అర్హత:** ఇంజినీరింగ్ డిగ్రీ/ డిప్లొమా ఉత్తీర్ణతతో పాటు ఏడాది పని అనుభవం ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేది:** 03.07.2018. **వెబ్‌సైట్:** www.ecil.co.in

ప్రవేశాలు

ఆర్ఐఎంసీ ప్రవేశ పరీక్ష

డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజీలో ఎనిమిదో తరగతి ప్రవేశానికి ఏపీపీఎస్సీ దరఖాస్తులు కోరుతోంది. **అర్హత:** ప్రస్తుతం ఏడో తరగతి చదువుతున్న లేదా పూర్తి చేసిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బాలురు అర్హులు. **వయసు:** 11 ఏళ్ల ఆరు నెలల నుంచి 13 ఏళ్ల మధ్య ఉండాలి. **ఎంపిక:** ప్రవేశ పరీక్ష, మౌఖిక, వైద్య పరీక్షల ఆధారంగా. **ఆఫ్‌లైన్ దరఖాస్తు చివరి తేది:** 30.09.2018. **పరీక్ష తేదీలు:** 2018 డిసెంబరు 1, 2. **వెబ్‌సైట్:** www.psc.ap.gov.in

సంగీతం, నృత్య కళాశాలల్లో ప్రవేశాలు

తెలంగాణ భాష, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలోని ఆరు ప్రభుత్వ సంగీతం, నృత్య కళాశాలల్లో 2018-19 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు. **కళాశాలలున్న ప్రదేశాలు:** హైదరాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్, వరంగల్, మంథని, కరీంనగర్. కోర్సుల వివరాలు, ప్రవేశం కోసం సంబంధిత కళాశాలల ప్రధానాచార్యులను సంప్రదించాలి. **దరఖాస్తు చివరితేది:** 30.07.2018.

సీఈఎస్ఎస్‌లో పీహెచ్‌డీ ప్రోగ్రాం

సీట్ల సంఖ్య: 15 **సబ్జెక్టులు:** ఎకనామిక్స్, సోషియాలజీ, జాగ్రఫీ, పొలిటికల్ సైన్స్ తదితరాలు. **అర్హత:** పీజీ, ఎంఫిల్, నెట్/ స్లెట్/ ఎఫ్‌డీపీ ఉత్తీర్ణత. **ఆఫ్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 25.07.2018. **వెబ్‌సైట్:** www.cess.ac.in

మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు